

దీక్షా దక్షతలకు కేసీఆర్ ఆదర్శం

తెలంగాణ ఉద్యమ చరిత్రను మరో మలుపు తిప్పిన్రు కేసీఆర్. ఆయన నాడు (నవంబర్ 29, 2009) చేపట్టిన దీక్ష కోట్లాది మందికి స్ఫూర్తి. అనంతరం, తెలంగాణ ఏర్పాటు దిశగా సాగిన పయనం ఏ తెలంగాణ వాది మరిచిపోలేనిది. ఆ మలుపు యాదిలో బీఆర్ఎస్ పార్టీ నగరంలో పెద్ద ఎత్తున నగరంలో దీక్షా దివస్‌ను చేపట్టింది. ఈ నేపథ్యంలో నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న కేసీఆర్ పట్టుదల, కార్యదక్షతపై ప్రతి కార్యకర్త జయజయ ధ్వానాలతో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. బీఆర్ఎస్ పార్టీ పోరాట పటిమ, కేసీఆర్ దీక్ష బూనిన విధాన్ని ఒకసారి మననం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల బైక్, కార్ల ర్యాలీలు చేపట్టి పార్టీ నేతలు బీఆర్ఎస్ భవన్ వరకు వేలాదిగా తరలివచ్చారు. ఐదారు కిలో మీటర్ల మేర వాహనాల ర్యాలీలను మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి తదితర నేతలు చేపట్టారు. తెలంగాణ కలను సాకారం చేసిన ధీరోదాత్తుడు.. కేసీఆర్, తెలంగాణ బాపు, తెలంగాణ జాతిపిత అంటూ పలువురు నాయకులను కార్యకర్తల దాకా పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.

వయోవృద్ధులకు మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భువనగిరి అర్బన్ : వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భువనగిరి అర్బన్, నవంబర్ 29 : వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. పట్టణంలోని రాయగిరిలో గల సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమంలోని వసతులను పరిశీలించారు. వయోవృద్ధులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, తాగునీరు, దుప్పట్లుతోపాటు వారికి అవసరమయ్యే వాటిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రామన్నపేట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంఏ మాజీద్, న్యాయవాదులు మొగులయ్య, స్వామి, సత్తయ్య, పాల్గొన్నారు.

సాధన మానసిక వికలాంగుల ఆశ్రమం సందర్శన

వలిగొండ : మండలంలోని టేకులసోమారం గ్రామ పరిధిలోని సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత శుక్రవారం సందర్శించి వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకులు మానసిక వికలాంగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, నకిరేకంటి మొగులయ్య, నోముల స్వామి, దంతూరి సత్తయ్య, గంగాభవాని పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకుంటే పోరుబాట : సర్పంచుల జేఏసీ

యాదాద్రి భువనగిరి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా సర్పంచ్‌ల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి కనీసం స్పందించరా అని సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేపాక నాగయ్య మండిపడ్డారు. డిసెంబర్ ఒకటో తేదీ వరకు తమ సమస్యలపై ప్రభుత్వం వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే డిసెంబర్ రెండు నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామని, సర్పంచ్‌ల కుటుంబాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడారు. ఎన్నికల ముందు సర్పంచ్‌లకు ఎన్నో హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోక పోవడం దారుణమన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఒక్క పైసా విడుదల చేయలేదని మండిపడ్డారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.750 కోట్లు ఇచ్చామని అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్కులను ప్రీజింగ్ చేసి, బిల్లులు రాకుండా చేశారని వాపోయారు. సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచుల జేఏసీ నేతలు

విష్ణు విస్తారాలో టౌన్ ప్లానింగ్ తనిఖీలు

సిటీబ్యూరో, నవంబర్ 29(నమస్తే తెలంగాణ): మాదాపూర్ భాగ్యనగర్ కాలనీ విష్ణు మార్గ్‌లోని సర్వే నం.1002లో నిర్మించిన హైరైజ్డ్ బిల్డింగ్ విష్ణు విస్తారాను శుక్రవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ బృందాలు తనిఖీలు చేశాయి. విష్ణు విస్తారా అపార్ట్‌మెంట్ ఏ అండ్ బీ బ్లాక్స్ ఫ్లాట్ ఓనర్స్ మ్యుచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ మెయింటనెన్స్ ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేశారు. కైత్లాపూర్ విలేజ్ సర్వే నం. 1002లో విష్ణు విస్తారా 2014లో అనుమతి తీసుకుని ఏ, బీ బ్లాకులలో నిర్మాణం చేపట్టారు. ఏ, బీ బ్లాక్‌లో గ్రౌండ్ అప్పర్ 14 అంతస్తులు, రెండు సెల్లార్లతో నిర్మాణం జరిగింది. ఈ హైరైజ్డ్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 2023లో అక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) ఇచ్చింది. ఐతే, ఈ నిర్మాణంలో కాలమ్స్ నిబంధనల మేరకు పనులు జరగలేదని, లోప భూయిష్టంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేపట్టారని, కాలమ్స్ ప్రమాదకర స్థాయిలో పగుళ్లు, భవనం ఒంగి ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నామని సతీశ్ రెడ్డి అనే ఫిర్యాదుదారుడు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సమగ్ర నివేదిక ఆందోళనకరంగా ఉందని, సెల్లార్‌లో వాటర్ రావడం, ఇందులో 238 ఫ్లాట్స్‌లో ఉంటున్న 1000 మంది నివాసితుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అధికారులకు మొర పెట్టుకున్నారు. తనిఖీలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఓనర్స్, నిర్మాణదారుడిల మధ్య సమన్వయ లోపంతో పాటు పక్కనే ఉన్న నాలా నుంచి సీపేజ్ వాటర్ వస్తుందని, నిర్మాణంలో ఎలాంటి తేడా లేదని తేల్చారు. ఈ క్రమంలోనే నిర్మాణ సామర్థ్యంపై శాంపిల్స్ సేకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు నిర్మాణదారుడి పట్ల జీహెచ్ఎంసీ ఏ విధంగా వ్యవహరిస్తుందోనని చర్చ జరుగుతున్నది.

మాల్కంబ్ పోటీల్లో ట్రినిటీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చౌటుప్పల్, నవంబర్ 29 : నాగర్‌కుర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27, 28తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మాల్కంబ్ పోటీల్లో చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో విద్యార్థులు కె.అక్షిత, ఎన్.లోహిత, ఎం.సహస్ర, ఎస్.శ్రీహర్ష ఉన్నారు.

శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను ఎంఈఓ గురువారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని ముంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, పీఈటీలు బిక్కునాయక్, గోపాల్, మహేశ్, కిరణ్, సుమతి, కృష్ణమోహన్ అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఆలేరు టౌన్, నవంబర్ 29 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఆలేరులోని జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ -14 ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికల్లో ఆయన శుక్రవారం పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మేధస్సు చురుకుగా పని చేస్తుందన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 180 మంది బాల, బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాలల సమాఖ్య కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, ఫుట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడసంతుల మధుసూదన్, ఎంఓ ఎర్ర లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని గుజ్జ గ్రామంలో ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తలు పసుకుల చిన్న మల్లయ్యకు రూ.15వేలు, చాడ ఎల్లమ్మకు రూ.10వేలు, ఎర్ర మల్లమ్మకు 10వేల రూపాయల ఆర్థిక సాయం బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాత్రి సాగర్ శుక్రవారం అందజేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు గంగదేవి సత్తయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడ్డం మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ శోభారాణి మాట్లాడుతూ ఆరు నెలల వరకు చిన్నారులకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆ తరువాత అదనపు ఆహారం పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీలో ఇచ్చే బలవర్ధక ఆహారంతో పిల్లలు త్వరగా ఎదుగుతారని, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు బాలామృతం ఇస్తున్నామని చెప్పారు.

ఇష్టపడి పని చేస్తే ఏదైనా కష్టం కాదు : చింతకింది మల్లేశం

ఆలేరు టౌన్, నవంబర్ 29 : ఇష్టపడి పని చేస్తే ఏదైనా కష్టం కాదని ఆసు యంత్రం సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థినులకు చేనేత కళాకారులు చీరెలు ఎలా తయారు చేస్తారు అనే అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. 7వ తరగతి జనరల్ సైన్స్ పాఠ్యాంశంలో వీవర్స్ పని ఎలా చేస్తారని ఉన్నది. దానిని స్వయంగా చూపించాలనే సంకల్పంతో పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలను మల్లేశం ఇంటికి తీసుకెళ్లారు. ఆయన ఇంట్లో చీరెలకు రంగుల అద్దకంపై వివరించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని క్రాంతినగర్, సిల్క్‌నగర్ కాలనీల్లో చీరెల తయారీ విధానం, వార్పు, వెప్పు అంటే ఏమిటి.. దారం నాడ నుంచి ఎలా వెళ్తుంది.. నేతన్నలు పాకు చెక్కలను ఎలా తొక్కుతున్నారు. చిటికి డిజైన్ ఎలా కలుపుతున్నారు? సిల్క్ దారం ఎలా తయారవుతుందనే అంశాలను బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు లలిత, దివ్య, మంగ పాల్గొన్నారు.

వీవర్స్ పని ఎలా చేస్తారో విద్యార్థినులకు చూపిస్తున్న మల్లేశం, ఉపాధ్యాయులు

బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత

వలిగొండ, నవంబర్ 29 : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దేశపాక యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి పార్టీ బీమా నుంచి రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును యాదగిరి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం భువనగిరిలో అందజేశారు. కార్యక్రమంలో ఎండీ సలీం, దేశపాక సైదులు, పాలేర్ల మహేశ్, తుర్కపల్లి వేణు పాల్గొన్నారు.

యాదగిరి కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

మధ్యాహ్న భోజనం తనిఖీ

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 29 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాసీల్దార్ కృష్ణ శుక్రవారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా వంట గది, వాష్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. రోజూ ఒక ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తాసీల్దార్ కృష్ణ